2. ఆపత్కాలమునందుఁ - బ్రాపు నీవని వేఁడఁ - గాపాడి రక్షించు - కరుణాసముద్రుఁడ ॥నమ్మితి॥

3. ఎన్ని తప్పులు నాలో - నున్న నీ దయ చేత - మన్నించి రక్షించు - మహిత దేవ కుమార ॥నమ్మితి॥

4. దాసుని మొఱ నీవు - వేసారక విని - వాసిగా రక్షించు - పరమ జనక నన్ను ॥నమ్మితి॥

- బుజ్జారెడ్డి

## 327 పశ్చాత్తాప గీతి

### (దా. కీ. 139)

రా-భూపాళము (చాయ : చింతలేదిఁక) తా - త్రిపుట

దేవ నీవు నన్నుఁ బరిశో -ధించి బాగుగఁ దెలిసికొంటివి - నీ వెఱుఁగు దువు నేను కూర్చుండుటయును - నే లేచుటయును ॥దేవ॥

1. నాకుఁ దలఁపులు పుట్టినపుడే - నా మనస్సు గ్రహించి నాఁడవు = ప్రాకటంబుగ నా నడక నా పడకను - బరిశీలించితి ॥దేవ॥

2. నీకు నా సమస్త చర్యల - నిజము తెలియును, మాట నాల్కకు = రాకపూర్వము దేవ సర్వముఁ బూర్తిగా - నీకే - తెలియును ॥దేవ॥

3. నా వెనుకను ముందు నుండి - నన్ను నావరిఁచి నీ చెయ్యి = నీవు నాపయి నుంచితివి నా మది కది - కేవల మందదు ॥దేవ॥

4. అరుగుదెంచెద నెచ్చటికి నీ - యాత్మ యొద్ద నుండి యింక నీ = పరమ సన్నిధి నుండి నే నెచ్చోటికిఁ - బారిపోవుదు ॥దేవ॥

5. ఏను వేకువ టెక్కలను ధరి - యించి కడలిలో నున్న నీ చెయి = మానక నడిపించు నీ కుడి చేయియు - మరి నను గైకొను ॥దేవ॥

6. నను సృజించిన తెఱఁగెఱుంగఁగ - నాకు భయ మాశ్చర్య మొదవును = గనుక నీకును నేఁ గృతజ్ఞతాస్తుతులను జెల్లింతును ॥దేవ॥



7. నేను పిండం బైనయప్పుడు - నీవు నను వీ క్షించినాఁడవు = నేను బ్రతుకుట ముందె లిఖితంబాయెను - నీ గ్రంథంబులో ॥దేవ॥

8. నిక్కముగ దేవా నీ తలఁపు - లెక్కువ ప్రియ మగును నాకును = లెక్కకు నెక్కువౌ ॥దేవ॥

- మల్లెల దావీదు

## 328 పశ్చాత్తాపము లేనిదే పరమ భాగ్యము లేదు

రా - అసావేరి తా-ఆట

పాప [1]పశ్చాత్తాప మొందని వారికి - పరమ భాగ్య మేడ నబ్బునే - మనసా = పాపాత్ములకు యేసు - [2]పరమండలము నుండి భూమధ్యమునకుఁ దా వచ్చెను - పాపిష్ఠుల రమ్మని పిలిచెను - నా - [3]ప్రాపుఁ గోరుమని చెప్పెను - మనసా ॥పాప॥

1. ధైర్యమొంది నన్ను దలఁచిన వారికి - పూర్వజ్ఞాన మొనఁగూర్తును - [4]దు -ర్భావ మెల్లను విడఁ దీతును - యేసు - వారి యాజ్ఞ యని యనియెను - మనసా ॥పాప॥

2. బలపడి నాదు నామము గొన్నవారికి - యిల బాంధవుల వైరమందును - సర్వ - కుల జనంబుల క్రోధమందును - స్నేహి - తుల యెడ బాటులు గల్గును- మనసా ॥పాప॥

3. అడిగిన వారికి నొసఁగుదు ననుచును - కడుమోదమున నాజ్ఞాపించెను - తట్టు - తట్టుఁడని బోధించెను - విప్పి - విడబడునని ప్రేమించెను - మనసా ॥పాప॥

4. దోషములన్నియు యేసు నాథుడు తా - మోసికొని సమ్మతించెను - సిలువ - వేసిన వారిని దీవించెను - మోక్ష- వాస సాధన మని తెల్పెను- మనసా ॥పాప॥

- వి.వెంకటస్వామి

[1]మారుమనస్సు. [2]పరలోకము. [3]ఆశ్రయము. [4]చెడ్డ కోరికలు యావత్తు.